# సోమశిల-స్వర్ణముఖి లింకు కాల్వను తక్షణమే పూర్తిచేయాలని ఆందోళన



ధర్నా సందర్భంగా ప్రసంగిస్తున్న కా॥ సునీత

**వెంకటగిరి, 18-6-17 :**

నెల్లూరుజిల్లాలో రాపూరు, వెంకటగిరి, డక్కిలి; చిత్తూరుజిల్లాలో కాళహస్తి, ఏర్పేడు మండలాల్లో- వెలుగొండ క్రింది గ్రామాల చెరువులకు సాగునీటిని అందించే లక్ష్యంతో ప్రారంభించిన సోమశిల - స్వర్ణముఖి లింకు కాలువ(ఎస్ఎస్ఎల్సి)ను పాలకులు 15 ఏళ్ళ గడుస్తున్నా పూర్తి చేయలేదు. టిడిపి అధికారంలోకి వచ్చాక కాలవ డిజైను మార్చి, కాలవ ప్రారంభంనుండి 56.5 కి.మీ.వరకు అటవీశాఖ అనుమతులు రాలేదంటూ పని ఆపివేశారు. దీనివలన సోమశిల జలాలు రాపూరు, డక్కిలి ప్రాంతాలకు అందవు. అలాగే 56.5 కి.మీ నుండి 100 కి.మీ వరకు అనగా కాలవ ముగింపువరకూ లోలెవెల్లో నీరు తీసుకెళ్ళేవిధంగా డిజైన్ చేయటంవలన వెంకటగిరి మండలం పాలెంకోట, మొక్కలపాడు, టిబిపల్లి, దాచెరువు, కుర్జాగుంట గ్రామాలకు సాగునీటి సౌకర్యం లేకుండాపోయింది. ఈ గ్రామాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరివ్వాలని, ఎస్ఎస్ఎల్సిని పూర్తిచేయాలనే ప్రధాన డిమాండ్తోపాటుగా, తక్షణ కరవు సహాయ చర్యలను డిమాండ్చేస్తూ వెంకటగిరి తహశీల్దారు కార్యాలయం ఎదుట రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అధికారులకు మెమోరాండం అందజేశారు.

ధర్నా సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥జి.సునీత మాట్లాడుతూ కాలువ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో కూడా ఏళ్ళతరబడి సాగుచేసుకుంటున్న భూములకు పరిహారం ఇవ్వకుండా బలవంతంగా గుంజుకునే ప్రయత్నాలను నిరసించారు. ఈ కార్యక్రమంలో ఇంకా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కామ్రేడ్స్ వివి రమణయ్య, ఆర్.సుబ్బరాయుడు, జి.కృష్ణారెడ్డి, జి.తిరుపాలు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. వందమంది రైతులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ధర్నా ముందుగా వెలుగొండ కింది గ్రామాలలో ప్రచారం జరిపారు.

oooo